క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలకు తొమ్మిది అవార్డులు



ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు 2023–24వ సంవత్సరంలో అందించిన విశిష్ట సేవలకుగాను వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం తొమ్మిది అవార్డులు లభించాయి. వీటిలో క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్‌కు ఐదు అవార్డులు లభించాయి. పోరంకిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, దినవహి ప్రసాద్, నూకల వెంకట సాంబశివరావు, సీహెచ్ కుటుంబరాజు, బండి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో 'మాదు'కు అంతిమ వీడ్కోలు

కంకిపాడు: అశ్రునయనాలతో మాదు వసంతరావు భౌతికకాయానికి అంతిమ వీడ్కోలు పలికారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా నేత, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిన విషయం తెలిసిందే. వసంతరావు భౌతికకాయానికి శనివారం కంకిపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అశ్రునయనాలతో బంధుమిత్రులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు అంతిమయాత్రలో పాల్గొని వసంతరావు భౌతికకాయానికి వీడ్కోలు పలికారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పలువురు రాజకీయ పక్షాల ప్రముఖులు వసంతరావు భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

కంకిపాడులో కుండపోత వర్షం



కంకిపాడు: ద్రోణి ప్రభావంతో కంకిపాడు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకూ కుండపోత వర్షం కురిసింది. వర్షానికి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు తోడయ్యాయి. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. కంకిపాడు బస్టాండు సెంటరు, రైతుబజారు ప్రాంగణం, విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బైపాస్ మార్గం, సర్వీసు రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

చిట్టీల వ్యాపారి, ఆయన కుమారుడికి రిమాండ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిట్టీల వ్యాపారం పేరుతో రూ.కోట్లలో సొమ్ము వసూలు చేసి నాలుగు నెలల క్రితం పరారైన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజులను హనుమాన్‌జంక్షన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరిని మచిలీపట్నంలోని జిల్లా కోర్టులో శనివారం హాజరు పర్చటంతో న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ కంపెనీ ఏర్పాటు చేసి తోటి టీచర్లు, ఉద్యోగుల నుంచి రూ.కోట్లలో చిట్టీలు, డిపాజిట్లు కట్టించుకుని పరారైన ఉదంతం విదితమే. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 420, 406, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్థల డిపాజిట్ల రక్షణ చట్టం కింద తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజులపై ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ సమీపంలో పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజు పోలీసులకు చిక్కారు. దీంతో వీరిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు.

పోరంకిలో జూదరులు అరెస్టు

రూ.2 లక్షల నగదు, 12 మొబైల్ ఫోన్లు, వాహనాలు సీజ్

పెనమలూరు: పోరంకి గ్రామంలో జూదం ఆడుతున్న 16 మంది జూదరులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం పోరంకి– నిడమానూరు రోడ్డులో ఓ అపార్టుమెంట్‌లో కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు సర్చ్ వారెంట్‌తో మెరుపు దాడి చేశారు. పట్టుబడిన 16 మంది నుంచి రూ 2,01,202 లక్షల నగదు, 12 మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లు సీజ్ చేశారు. నిందితుల వద్ద సొమ్ము స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా విజయవాడకు చెందిన వ్యక్తి అపార్టుమెంట్ అద్దెకు తీసుకొని పేకాట నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారిపై చిమ్మచీకట్లు

- వెలగని సెంట్రల్ లైటింగ్
- పెనమలూరు నుంచి కానూరు వరకు అంధకారం
- రాత్రి వేళల్లో ప్రమాదకరంగా మారిన ప్రయాణం





పోరంకిలో వెలగని సెంట్రల్ లైటింగ్

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి అంధకారంగా మారింది. గత కొద్దిరోజులుగా బందరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి. పెనమలూరు నుంచి కానూరు వరకు లైట్లు వెలగక పోవటంతో వాహనదారులు రాత్రి సమయాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై బందరు రోడ్డు విస్తరించిన తరువాత సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే అథారిటీ(ఎన్‌హెచ్ఐ) పర్యవేక్షణలో ఈ రహదారి ఉంది. జాతీయ రహదారిపై ప్రమాణించే వాహనదారుల వద్ద దావులూరు టోల్ గేట్ నుంచి టోల్ రుసుం వసూలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై కానూరు నుంచి గంగూరు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కొద్దికాలం ఈ లైట్లు వెలిగాయి. ఆ తరువాత గంగూరు ప్రాంతంలో లైట్లు వెలగడంలేదు. దీంతో అనేక ప్రమాదాలు జరిగాయి. సెంట్రల్ లైట్లు వెలిగించండని స్థానికులు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది.

అలుముకున్న గాఢాంధకారం

జాతీయ రహదారిపై ఇప్పుడు అంతా అంధకారం అలుముకుంది. కానూరు నుంచి పెనమలూరు సెంటర్ వరకు గతంలో వెలిగిన లైట్లు కొద్ది కాలంగా వెలగటం లేదు. వాహనాల నుంచి పడే లైట్ల వెలుతురులోనే వాహనదారులు అతి జాగ్రత్తగా ప్రయాణం సాగించాల్సి వస్తోంది. వాహనాలు రాకపోతే రోడ్డుపై చిమ్మ చీకట్లలో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి లైట్లు ఎందుకు వేయటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బందరు రోడ్డుపై లైట్లు వెలగక పోవటంతో రాత్రి అయితే మహిళలు ప్రయాణించటానికి ఆందోళన చెందుతున్నారు. చైన్ స్నాచర్స్, సెల్‌ఫోన్ చోరుల బెడద ఎక్కువగా ఉండటంతో బందరురోడ్డుపై ప్రయాణం భయానకంగా ఉంది. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఐ అధికారులు స్పందించి సెంట్రల్ లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ప్రయాణ భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో నిందితులను శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంపై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నిడమర్తి రామారావు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా శనివారం స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం కొవ్వొత్తులతో వైఎస్సార్ సీపీ నేతలు ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి గుర్తుగా గత ప్రభుత్వం విజయవాడ నగరం నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేసి, అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తే అది టీడీపీ నేతలకు కంటగింపుగా మారందన్నారు. కుట్ర పూరితంగానే విగ్రహం ముందు ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాలిమేర పేతురు, తిరివీధి నానిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు కాకర్లమూడి సతీష్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాద ఘంటికలు



కామయ్యతోపు వద్ద బందరు రోడ్డుపై గుంతకు అడ్డుగా పెట్టిన స్టాపర్

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై పప్పుల మిల్లు నుంచి కామయ్యతోపు వైపునకు వచ్చే రహదారిపై పెద్ద గుంత పడింది. ఆ గుంతలో పలుమార్లు వాహనదారులు పడిపోయి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. పోలీసులు గుంతకు అడ్డుగా స్టాపర్ పెట్టి తాత్కాలికంగా ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నారు. అయితే రాత్రి సమయాల్లో గుంతకు అడ్డుగా పెట్టిన ఇనుప స్టాపర్ వాహనదారులకు సరిగా కనిపించక పోవటంతో ప్రమాదాల సంఖ్య ఇంకా పెరిగింది. దీంతో బందరు రోడ్డుపై ప్రయాణం దినదిన గండంగా పరిస్థితులు ఉన్నాయి. అధికారులు రోడ్డుపై పడిన గుంతకు మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రమాదాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. –పెనమలూరు

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్



కంకిపాడులో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్



ఉంగుటూరులో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి



విజయవాడలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు

కంకిపాడు: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ వరప్రసాద్ సూచించారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామాభివృద్ధి అంశాలపై మూడు రోజుల పాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామాలు ప్రగతిపథంలో సాగటానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఘన వ్యర్థ పదార్థాల యూనిట్‌లను సమర్థంగా నిర్వహించటం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని, గ్రామాల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొనేందుకు దోహదపడుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, సమష్టిగా ముందుకు సాగితేనే గ్రామాలు ప్రగతి బాటన పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, ఈఓఆర్‌డీ పీవీఎస్ మైథిలి, మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని గుడివాడ డీఎల్‌పీవో జి.సంపత్‌కుమారి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. డీఎల్‌పీవో సంపత్‌కుమారి శిక్షణ తరగతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, మండల పరిషత్ ఏవో బసవయ్య, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతికి జీపీడీపీ అవసరం

విజయవాడరూరల్: గ్రామ పంచాయతీలు ప్రగతి పథంలో నడిచేందుకు జీపీడీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) ఎంతో ఉపయోగపడతాయని ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్ ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ ఎల్ఈడీ వీధిదీపాలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టు మార్కెటింగ్ విధానాలపై మాట్లాడారు. నున్న గ్రామ సచివాలయ–3 కార్యదర్శి వరుణ్ సీసీ చార్జీలు చెల్లింపులపై మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో పలువురు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధుల నుంచి రక్షణ



సూరంపల్లిలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరంరూరల్: పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందాలని మండల వైద్యాధికారి పి.శ్రీహర్ష అన్నారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో శనివారం 104 వాహన వైద్య సేవల్లో ఆయన పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ ప్రస్తుతం వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, ఈ పరిస్థితులలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. దీర్ఘకాల రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. 104 వాహన వైద్య సేవలతో ప్రతి నెలా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని, ఈ సేవలను రోగులు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో స్వరూప, ఏఎన్ఎం ఆర్.లక్ష్మి, ఆశ కార్యకర్తలు స్వర్ణలత, నిర్మల తదితరులు సేవలందించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక భరోసా



నగదు పురస్కారాలు అందజేస్తున్న బ్యాంక్ డైరెక్టర్లు

గన్నవరం: ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ ఆర్థికంగా భరోసా కల్పిస్తుందని ఆ బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో శనివారం బ్యాంక్ సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున, ఇంటర్మీడియెట్‌లో ముగ్గురికి రూ.7,500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ తమ బ్యాంక్ లాభాల్లో కొంత భాగం ఖాతాదారుల సంక్షేమానికి వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రతిభావంతులైన పిల్లలను ప్రోత్సహించేందుకు గతేడాది రూ.2.35 కోట్లు నగదు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి పిల్లల చదువులకు రూ.2 లక్షల వరకు అతితక్కువ వడ్డీకే హామీ లేని రుణాలను అందజేయనున్నట్లు తెలిపారు. విదేశీ, ఉన్నత విద్య అవసరాలకు రూ.10 నుంచి రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. తమ బ్యాంక్ నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులకు 0.5 శాతం వడ్డీపై రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. బ్యాంక్ డైరెక్టర్లు పీవీ రమణారావు, సీహెచ్ కోటేశ్వరరావు, బ్యాంక్ సంప్రదింపుల కమిటీ సభ్యులు గన్నె వెంకట్రావు, బ్యాంక్ మేనేజర్ సీహెచ్‌వీ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా వరద నీటి ప్రవాహం


- ఏటిపాయ అంచులు తాకుతూ నీటి ప్రవాహం
- ఇంకా ముంపులోనే కాసరనేనివారిపాలెం శివాలయం
- కొనసాగుతున్న బందోబస్తు



మద్దూరు వద్ద నిలకడగా ఉన్న నీటి ప్రవాహం

కంకిపాడు: ఏటిపాయలో వరదనీటి ప్రవాహం నిలకడగా సాగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీటి విడుదల తగ్గటంతో కృష్ణానది పాయలో వరద నీరు తగ్గుముఖం పట్టింది. అయితే బ్యారేజీ దిగువ నుంచి వరద నీరు నిలకడగా సముద్రం వైపు సాగుతోంది. దీంతో మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి ప్రవహించే కృష్ణానది ఏటిపాయలో నీటి ప్రవాహం నిలకడగా ఉంది. వరదనీరు ఏటిపాయ అంచులు తాకుతూ ప్రవహిస్తోంది. కాసరనేనివారిపాలెం గ్రామ పరిధిలో ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. ఇంకా ఆలయం ముంపులోనే ఉంది. ఏటిపాయలోని రహదారి మార్గం బయటపడకపోవటంతో ఇంకా రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. వరదనీటి ప్రవాహ రీత్యా రెవెన్యూ యంత్రాంగం మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వద్ద బందోబస్తు చర్యలను కొనసాగిస్తోంది. పశువులు మేతకు వెళ్లకుండా, మత్స్యకారులు ఏటిపాయలో చేపల వేటకు వెళ్లకుండా గస్తీ నిర్వహిస్తున్నారు. బందోబస్తును తహసీల్దార్ వి.భావన్నారాయణ పర్యవేక్షిస్తున్నారు.

అసుర సంధ్యవేళ.. అరుణారుణ శోభ



ఇది ఏ చేయి తిరిగిన చిత్రకారుడో గీసిన చిత్రం కాదు సుమా... ఆకాశం కాన్వాసుపై ప్రకృతి ముద్రించిన అద్భుత చిత్రరాజం. జలజల పారే ఏటిపాయ ఒక వైపు..అరుణకాంతులు మరో వైపు...కంకిపాడు మండలం కాసరనేనివారిపాలెం వద్ద ఏటి ఒడ్డున శనివారం సాయంసంధ్య వేళ చూడముచ్చటైన ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. –కంకిపాడు

దొంగతనం చేస్తూ దొరికిపోయాడు!

పెనమలూరు: దొంగతనం చేస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించటంతో శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు తాడిగడప డొంక రోడ్డు శివపార్వతీ రెసిడెన్సీకి చెందిన దాసరి ఆదిశేషు గ్రామంలో గత 10 సంవత్సరాలుగా జనరల్ స్టోర్స్ పెట్టుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. యథావిధిగా శుక్రవారం రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆదిశేషు ఇంటికి వచ్చి మీ షాపులోపల ఏదో అలికిడి అవుతోందని చెప్పాడు. వెంటనే ఆదిశేషు స్థానికులను వెంటబెట్టుకుని షాపు వద్దకు వచ్చి చూడగా, షాపు పైకప్పు రేకులు పగిలి ఉన్నాయి. షాపు తాళం తీసి తలుపులు తెరవగా షాపులోపల ఓ వ్యక్తి ఉండడాన్ని గమనించారు. వెంటనే అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు కానూరు పాత చెక్ పోస్టుకు చెందిన వెంకటేష్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫీవర్ సర్వే పరిశీలించిన డీఎంహెచ్‌వో గీతాబాయి



వీరవల్లిలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దోమలు వ్యాప్తి చెందటంతో విష జర్వాలు ప్రబలే అవకాశం ఉందని, దీన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంటింటి ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముచ్చటించి, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ, డయేరియా, మలేరియా, రాపిడ్ టెస్ట్‌లను నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. దోమల ల్వారా నివారణకు, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీహెచ్ఎన్ కె.సౌదామిని, ఎంపీహెచ్ఎస్ ప్రదీప్, పీహెచ్‌సీ సిబ్బంది ఏడుకొండలు, త్రివేణి పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడిక తీత



పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి రాజేంద్రప్రసాద్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయిన్లతో పాటు, ప్రధాన రహదారి, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను శనివారం మినీ జేసీబీ సహాయంతో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వర్షాలకు డ్రెయిన్లు పొంగి మురుగునీరు రహదారుల పైకి చేరుతున్నాయని పంచాయతీకి అందిన ఫిర్యాదుల మేరకు సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పూడిక తీయించామన్నారు. గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

28న ఏటీప సర్వసభ్య సమావేశం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీ నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు రాజనాల వెంకటరమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు.